క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, కుమ్మర కాలనీ, పాత వ్యవసాయ మార్కెట్ యార్డు, ఏఎంజీ డొంక, గుంటూరు రోడ్డులో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు మోడల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

నాదెండ్ల: చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో ఈ నెల 21వ తేదీన ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు 150 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మొత్తం వంద సీట్లు కాగా, ప్రవేశ పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9.30 గంటలకే పాఠశాల వద్దకు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లతో హాజరుకావాలన్నారు.

రావులాపురంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఆరోగ్య సురక్ష ఫేజ్–2లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకరనారాయణ, కంటి వైద్యులు ఎస్‌కె చాంద్ బాషాలు వైద్య చికిత్సలు అందజేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 320 మందికి వైద్య సేవలు అందజేశామని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేటలో రెండోరోజు ఒక్క నామినేషనే!

చిలకలూరిపేట: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఒక నామినేషన్ దాఖలైంది. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున తన్నీరు రత్నకుమారి ఎన్నికల అధికారి బి.నారదమునికి నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ పత్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారి వాటిని స్వీకరించారు.

అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

సత్తెనపల్లి: అరుణాచలం, గిరి ప్రదక్షిణ దర్శనానికి సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి 23న అరుణాచలం, గిరిప్రదక్షిణ దర్శనానంతరం అదే రోజు సాయంత్రం కంచి మీదుగా తిరుగు ప్రయాణమై.. 24న ఉదయం సత్తెనపల్లి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీ టికెట్ ధర రానూపోను ఒక్కొక్కరికి రూ.2 వేలుగా నిర్ణయించామని తెలిపారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.వేళాంగిణి మేరీ శుక్రవారం తెలిపారు. ఐదో తరగతి పూర్తిచేసుకొని ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటల కల్లా ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో పొందవచ్చని సూచించారు. మొత్తం 100 సీట్లకు గాను 115 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి



కసుకుర్తి బాలమహేంద్ర

నకరికల్లు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని నర్సింగపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలం అయ్యప్ప రాజుపాలెం గ్రామానికి చెందిన కసుకుర్తి బాల మహేంద్ర (23) మండలంలోని నర్సింగపాడు గ్రామానికి వచ్చి గత నెల రోజులుగా వరిగడ్డి కట్టలు కట్టే మిషన్ పనులు చేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌కు మరమ్మతులు చేసి, దాని కూర్చునే ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. ట్రాక్టర్ గేర్‌లో ఉండడంతో ఒక్కసారిగా ముందుకు కదలి అతని తలపైకి ఎక్కింది. తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. కాగా మృతుడు అవివాహితుడు.

మళ్లీ గెలిచేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- వినుకొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు
- బొల్లాపల్లిలో జోరుగా ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు



మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బొల్లాపల్లి: నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్ సీపీ శాసనసభ్యులు, అసెంబ్లీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, చెంచుకుంట తండా, లింగంగుంట తండా, పాపాయపాలెం, వీరప్పకుంట తండా మేకలదిన్నె తండాల్లో వైస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కాంక్షిస్తూ బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు, ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రధాన కూడళ్లలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేద ప్రజల సంక్షేమాన్ని గుర్తించిందన్నారు. నవరత్నాలు వంటి సంక్షేమం ప్రతి పేదవాడి చెంతకు చేరిందని, పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు మరింత చేరువ చేశారని తెలిపారు. చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమం ఉండదని, పేదలను నట్టేట ముంచుతారని విమర్శించారు. 2014లో గెలిచిన తెలుగుదేశం ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా స్వచ్ఛంద సేవలు అందజేశారన్నారు. మే నెల 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్లమెంటుకు పి.అనిల్‌కుమార్ యాదవ్, శాసనసభకు బొల్లా బ్రహ్మనాయుడును అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత మీపై ఉందని, మీ అభిమానమే రాబోయే ఐదేళ్లు తిరిగి మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పగ్గాలు చేపట్టేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- వెఎస్సార్‌సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు
- గణపవరంలో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



గణపవరంలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు

నాదెండ్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, రానున్న ఐదేళ్ల కాలంలో మెరుగైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. నాదెండ్ల మండలంలోని గణపవరం గ్రామంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీకు వచ్చిన కావటిని పార్టీ నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజీవ్‌గాంధీ కాలనీ, 7 ఎకరాలు, 4 ఎకరాలు, చవిటిపాలెం, వేలూరు రోడ్డులోని జిల్లాపరిషత్ క్వారీ ప్రాంతాల్లో పర్యటించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న సంక్షేమ ఫలాలు పొందిన కుటుంబాలు కావటిని చిరునవ్వుతో స్వాగతించారు. కరపత్రాలను పంపిణీ చేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా కూడళ్లలో ప్రజలను ఉద్దేశించి కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికార పగ్గాలు చేపట్టనుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు రాష్ట్రంలో విస్తృతంగా జరుగుతున్న అన్ని సంస్థల సర్వేలే ఇందుకు నిదర్శనమన్నారు. సీఎం జగన్ చేసిన పారదర్శన పాలనకు కులమతాలకు అతీతంగా జగనన్నకు లభిస్తున్న ప్రజల ఆశీర్వాదంగా భావిస్తున్నామని తెలిపారు. మహాకూటమి పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని కుహన రాజకీయాలు చేసినా రాష్ట్ర ప్రజలు తమ ఓటుతో మరోమారు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామపార్టీ అధ్యక్షులు కాట్రు రమేష్, జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు, సొసైటీ మంగు ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ అల్లడి రవికుమార్, కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఐతా శ్రీనివాసరావు, ఆముదాలపల్లి ఆంజనేయులు, షేక్ రహంతుల్లా, ప్రభుదాసు, భీమయ్య, సొంగ వెంకటేష్, నాగయ్య, శంకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, పిల్లి సాగర్, కాటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లింగంగుంట్లలో డాక్టర్ గోపిరెడ్డి పర్యటన



ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సుష్మితారెడ్డి



లింగంగుంట్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్లలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి నర్సిరెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, కామిరెడ్డి కిషోర్‌రెడ్డి, కామిరెడ్డి సుధాకరరెడ్డి, యన్నం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి గ్రామం భూ సమస్యను పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. న్యాయస్థానం నుంచి కూడా ఆమోదం లభించడంతో త్వరలోనే భూముల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామంలోని రజకులతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి, కమ్యూనిటి హాల్ నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి హామీ ఇచ్చారు.

జగనన్నకు మరో అవకాశం ఇవ్వండి

నరసరావుపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితా రెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం సాయంత్రం 25వ వార్డు పరిధిలోని పోస్టల్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ శ్రీనివాసరెడ్డిలకు ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి విజయం చేకూర్చాలని కోరారు. పలు అపార్టుమెంట్లు, ఇంటింటికీ తిరుగుతూ గత ఐదేళ్లకాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలియచేసే కరపత్రాన్ని ఓటర్లకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

శావల్యాపురం: ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఎంపీడీవో కోర్రపాటి కవితాచౌదరి అన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా ప్రతిరోజు 3200 మంది కూలీలు పంట కాల్వల్లో పూడిక తీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి అధికారులు సూచనల మేరకు పనులు చేసిన వారందరికీ రోజుకు రూ. 300 వేతనం మంజూరు అవుతుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రాథమిక చికిత్స తదితర వస్నీ ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. జాబ్ కార్డు కల్గి యున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించే బాధ్యత ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ ఆసిస్టెంట్స్‌లపై ఉందన్నారు. ఏపీవో రామారావు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులకు సంబదించి అన్నీ గ్రామాల్లో ఆడిట్ బృందాలు తనిఖీలు చేస్తారన్నారు. ఈఆర్థిక సంవత్సరంలో రూ. 5కోట్లు నిధులకు సంబంధించి ఉపాధి పనులు జరిగినట్లు ఏపీవో తెలిపారు. ఇందుకుగాను ఒక లక్ష 47 వేల పనిదినాలు కూలీలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పదిరోజుల పాటు ఆడిట్ బృందాలు తనిఖీలు చేసి అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు: మండలంలోని అనంతవరం గ్రామంలో అంకమ్మతల్లి మద్దిరాలమ్మ 13వ వార్షికోత్సవంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన స్కేటింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం సిస్టర్ రజిత శుక్రవారం తెలిపారు. విద్యార్థులు మల్లెల జస్వంత్, జ్ఞానేశ్వర్ ఆదిత్య, నరేంద్ర, సాయిరాం, జాహ్నవి, శాన్వి ఫ్లోరెన్స్, షైల, లలితాంబిక విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. విద్యార్థులను అభినందించారు.

గడపగడపకు వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



గణపవరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ



గణపవరంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందిస్తున్న పార్టీ శ్రేణులు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ పార్టీ నాయకులు ప్రారంభించారు. ముందుగా పోలేరమ్మ తల్లి, కోదండ రామాలయం, బొడ్డురాయి, దర్గా వద్ద ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గణపవరంలోని రాజీవ్ గాంధీకాలనీ, దింతెనపాడు డొంకలో డోర్ క్యాంప్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రం పంపిణీ చేశారు. బైకలకు యువత జెండాలు చుట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు తులం సుధాకర్, పిల్లి సాగర్‌బాబు, షేక్ ఆదంవలి, నాయకులు కాటా వెంకటేశ్వర్లు, ప్రభుదాసు, నాగయ్య, శంకరరెడ్డి, రహంతుల్లా, మలిశెట్టి సుబ్బారావు, జ్ఞానయ్య, బొంతా బాబు ఉన్నారు.

ఎమ్మెల్యే బొల్లా కుటుంబీకుల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా కుటుంబసభ్యులు

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుటుంబసభ్యులు పట్టణంలో ని24,27,30, వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డుల్లోని ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే బొల్లా వినుకొండకు చేసిన అభివృద్ధిని కరపత్రాల రూపంలో అందజేశారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుమార్తె మణికుమారి, అల్లుడు గంగాధరరావు, కోడలు స్వప్న, మనుమరాలు శ్రీతన్యలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రానివ్వకండి

- ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్
- యడ్లపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం
- అత్యవసర సమస్యలపై చర్చ, తీర్మానాలు నిల్

యడ్లపాడు: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ చెప్పారు. యడ్లపాడు మండల ప్రజాప్రరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అత్యవసర సమస్యలు గురించి చర్చలు మినహా ఎలాంటి తీర్మానాలు చేయడం వీలుకావన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో నిర్వహించిన ఈ సమావేశంలో కొత్త విషయాలు, రాజకీయ అంశాలపై చర్చలకు తావివ్వలేదు. దీంతో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి ప్రగతి తదితర విషయాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు జాగ్రత్త వహించాలని, అలాగే ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్నందున గ్రామాల్లో వడదెబ్బ తగలకుండా వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. తమ గ్రామాల్లోని ప్రజలకు వాటిపై చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధశాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

అగ్నిప్రమాదాల నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ



అగ్నిప్రమాద నివారణ కరపత్రాలతో అగ్నిమాపక సిబ్బంది

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్లో ఉన్న రేణుకా పిల్లల ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆసుపత్రి సిబ్బంది చిలకలూరిపేట అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వేసవిలో ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదవశాత్తు సంబంధిస్తే వాటిని నిరోధించడం తదితర అంశాలపై డెమో ద్వారా చూపించడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ జాష్టి, రమ్యకృష్ణ, ఆసుపత్రి సిబ్బందితో పాటు శ్రీకృష్ణ నర్సింగ్ హోం హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్పటల్స్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

నరసరావుపేట ఈస్ట్: అగ్నిమాపకశాఖ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేటు హాస్పటల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో అనుకోకుండా అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు చికిత్స పొందుతూ కదలలేక ఉన్న రోగులను సురక్షితంగా బయటకు తీసుకవచ్చే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందివ్వటంతోపాటు అప్రమత్తతతో మెలగి రోగులను రక్షించాలని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే భయంతో దూరంగా పారిపోకుండా కదలలేని రోగులను రక్షించేందుకు సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ప్రతి హాస్పటల్‌లో అగ్నిమాపక యంత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ జమ్ముల శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ ఏ.శేఖర్, ఫైర్‌మెన్ సతీష్‌బాబు, హోంగార్డ్ ఎస్.సాంబశివరావు, హాస్పటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను రక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది


దివ్యాంగులకు హోం ఓటింగ్ దరఖాస్తులు నమోదు



శావల్యాపురంలో హోం ఓటింగ్ దరఖాస్తు తీసుకుంటున్న బీఎల్‌వో లక్ష్మణ్

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు దివ్యాంగులు, 85 సంవత్సరాల వయసు పైబడిన వారందరికీ తమ ఇంటి వద్దనే ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 370 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ 12–డి ఫాం దరఖాస్తుల్లో ఓటు హక్కు కల్గిన వారి సమగ్ర వివరాలు సంబంధిత బీఎల్‌వోలు నమోదు చేసుకుంటారన్నారు. మంచంలో ఉన్న వారందరూ, నడవలేని వారు, పూర్తిస్థాయిలో అంగవైకల్యం కల్గిన వారందరూ ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషనర్ చర్యలు చేపట్టిందన్నారు. నియోజవర్గ స్థాయిలో ఎన్నికల అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. పోలింగ్ తేదీ వారం రోజుల ముందుగానే హోం ఓటింగ్ అవకాశాన్ని ఎన్నికల కమిషనర్ కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శావల్యాపురంలో హోం ఓటింగ్ దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో బీఎల్‌వోలు రంతు లక్ష్మణ్, మల్లెల రాధ, పంచాయతీ కార్యదర్శి మహేంద్రలు పర్యవేక్షణ చేశారు. ఈ అవకాశాన్ని అర్హత కల్గిన ఓటర్లు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

●జలదాతా...సుఖీభవ



తుర్లపాడు మేజర్ కాలువ ఆయకట్టు పరిధిలోని గణపవరం రక్షిత మంచినీటి చెరువుకు శనివారం సాగర్ జలాలు చేరాయి. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాల్వ ద్వారా జగనన్న ప్రభుత్వం నీటిని విడుదల చేసిన విషయం విదితమే. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన చెరువును నింపుతున్నారు. తుర్లపాడు మేజర్ కాలువ పరిధిలో కనపర్రు, ఎండుగుంపాలెం, అప్పాపురం, నాదెండ్ల, గణపవరం చెరువులకు సాగర్ జలాలు చేరాయి. పెదనందిపాడు బ్రాంచి కెనాల్ పరిధిలో చందవరం పూర్తిగా నిండగా, గొరిజవోలులో 50 శాతం వరకూ చేరాయి. చిరుమామిళ్ళ మేజర్‌పరిధిలో సంకురాత్రిపాడు, జంగాలపల్లె నూరు శాతం, చిరుమామిళ్ళ 50 శాతం నిండాయి. ఎన్ఎస్‌పీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శర్మ, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది చెరువులు నింపే పనిలో నిమగ్నమయ్యారు.

–నాదెండ్ల

●25 వరకు సాగర్ జలాలు



మండలంలోని 15 గ్రామపంచాయతీల్లోని 10 మంచినీటి చెరువులన్నింటిని సాగర్ జలాలతో నింపుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధవత్ ఆకాష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురం మంచినీటి చెరువును సందర్శించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ సాగర్ జలాలను ప్రజలు వృథా చేయరాదన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం మాత్రమే ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేసినట్లు చెప్పారు. సాగర్ జలాలు దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 25 వరకు సాగర్ జలాలు విడుదల అవుతాయన్నారు.

– శావల్యాపురం

భక్తిశ్రద్ధలతో ఆలయ పునఃప్రతిష్ఠ

సత్తెనపల్లి: బృగుబండ గ్రామంలో స్వయంభు జగన్నాథస్వామి, ఆంజనేయ స్వామి పోలేరమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com